



# సినిమాకి ఓ కథ

కథ
లెళ్లపల్లి, కందుల
మాటలు
కె.వి.యస్.శర్మ

చౌదరి పీథరుగుమీద కూర్చుని పొగాక్కాడ హిడుగ్గా మడుతున్నాడు. ఆతనికసింటూ చేతుల్నలుపుకుంటూ ఆచారి నిలబడ్డాడు. చౌదరికి తన్నొకట్టినా ఒట్లలేనిపోతారేమో అని బెదురు. చౌదరికి పొగాకు పంట, పొగాకు వ్యాపారం, ఇంకాటూర్సువాళ్లతో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఎవరికీ పొగాకువిషయంలో— బాకాకాదు. ఒక్క వెంకట్లక్ష్మిని మాత్రం బావా అని పిలిపిస్తాడు. చౌదరి సమ్మకాల్లో పొగాలం దప్పరించిన వాడే పొగాకు దానం చేస్తాడనేది ఒకటి. ఆచారికేమో చుట్టలు చూస్తే నోరూరుతుంది. చేతివేళ్లు నలుకుతాయి. పూర్వం రెండు మూడుసార్లాచారి, చౌదరిని చుట్టలడిగి లేదనిపించుకున్నాడు. పైగా మరో సారి పొగాక్కాడడిగితే మామూలుగా ఇచ్చే తోట కూర కాడ కూడా ఇవ్వనని చౌదరి తెగేసి చెప్పాడు. అందుకనే ఆచారి నోరూరినా నోరెత్తలేదు. ఆఖరికి చుట్ట చుట్టుకుని అదిముట్టించుకున్నాక చౌదరియే అడిగాడు.

'ఏటయ్యా ఆచారి గోరికాడ నక్కలాగా నాఇంటికాడ నిన్నట్నుంచి కాపేసావ్! కన్నమేస్తావా?' అని.

'ఎంతమాట! ఏకీమధ్య పొగాకు వ్యాపారంలో లాభాలొచ్చాయని సినిమా తీసే ఎత్తులో ఉన్నారని వెంకట్లక్ష్మి చెప్పింది.' అని ఆచారి వెంకట్లక్ష్మి పేరెత్తగానే చౌదరి కస్సుమంటూ,

'నీకు యెంకటలచ్మికి సంబంధమేటి? దానిగడపెక్కినోళ్ల కాళ్లిరగ్గొడతాను' ఆచారిని విలదీసాడు అనుమానంగా

'అప్పుడప్పుడు సినిమాల్లో లాగా అపార్థం చేసుకున్నారు. వెంకట్లక్ష్మి మీరు తనకిచ్చిన డబ్బు రూపాయికి పది పైసల వడ్డీకి ఫ్లాట్లు తిప్పుతుంది. ఈ మధ్య సొంతంగా సిగరెట్లకి డబ్బుల్లేక ఓ అర్ధరూపాయిప్పు కావాల్సి తన దగ్గర కెళ్లాను. తను అర్ధ రూపాయికాసు నా చేతిలో పెడుతూ అంది కదా 'నెట్టు దరిదరంతో యాడన్నాతే మా చౌదరి బాపడి సలహా చెప్ప సినేమా తీయించుగాదూ! నన్నెట్టి బొమ్మ తీయించాలని మాసర్దాపడి పోతున్నాడు. మంచి ఇంగిలీసు కత గుర్తొస్తే ఆయాస్పోయునేమో' అందండి' అంటూ తన మంచితనం వెల్లడించుకున్నాడు ఆచారి. చౌదరి నమ్మినట్టు కన్పించాడు. కథలు కల్పించి చెప్పగల సరుకు తనలో వున్నందుకు ఆచారి

లోలోపల ఆనందించాడు.

'అయితే నీ యెరికలో మంచి ఇంగ్లీసు కతుందా?' అనడిగాడు చౌదరి. ఆచారి నొచ్చుకుని 'ఇంగ్లీసుకథల ఖర్మేమిటండి. నూరు పైసల తెలుక్కథలున్నాయి. అసలు కథలో ఏముంది. కథ చెప్పే విధానంలో వుంది కాని.' అన్నాడు. అతగాడి చూపులు అతని వశంతప్పి పొగాకు మీదకు పోయాయి.

చౌదరి గమనించాడు. గమనించటంచేత వళ్ళు మండింది. 'ఏటయ్యా నక్కచూపులూ నువ్వూను. యాపారంలో మోమాటాలు పనికిరావు. కత్చెప్ప దల్చుకుంటే సెప్పు. లేకపోతే పో. అంతేగాని పొగాక్కాడ నేనిచ్చేది లేదు. రేపు నాదగ్గరోపన్లో కుదుర్తే వేమో కూడాను! గుర్తుంచుకో అనుకున్న జీతపు డబ్బులు కాక అంగుళపు ముక్క పొగాక్కాడైనా యెట్టను' అని చౌదరి ఖండితంగా ఆచారికి చెప్పాడు.

ఆచారికి చౌదరి తన్ని నక్కతోపోల్చటం నచ్చలేదు. పైగా నక్కచూపులంటాడు. తనకిష్టమైంది కళ్ళముందాడుతూ అందకుండా పోతుంటే కల్గేబాధ చౌదరికేం తెల్సు. చౌదరి చేతిలో పొగాక్కాడ చూస్తుంటే తనక్కలిగేబాధ ఆకలితోవున్న నక్క కళ్లెదుట చిన్నగొర్రెపిల్ల చెంగు చెంగున గెంతుతూవుండి తిందామంటే వీల్లేకుండా రాక్షసిలాంటి కుక్క ఆపక్కనే వున్నప్పుడు నక్క కుండే బాధ. అందుకే తనచూపు ఆకలితోవుండే నక్కచూపులా వుంటుంది. ఆకలితోవున్న నక్క....వుపవాసం చేసిన నక్క...నక్క వుపవాసంకథ... ఆచారి బుర్రలో మెరుపు మెరిసింది. చిన్నప్పుడు చదువుకున్న కథకి గొప్ప సైకలాజికల్ ట్రీట్‌మెంటివ్వవచ్చు. అందులో బోల్డు జీవిత సత్యాలున్నాయి. తను చౌదరి చేత ఆ సినిమాయే తీయించాలి.

'తమరు నక్కంటే గుర్తొచ్చింది. నక్కుపవాసం కథని సినిమాగా యెందుకు తియ్యరాదు?' అని అడిగాడు ఆచారి.

'ఆకత మాసిన్నోడు సంధ్యవావలోనో యెందులోనో సదువుతుంటే యిన్నా.... అది సినిమాకెట్టా పనికొస్తది? సినిమా కొచ్చేవోళ్ళు మాసిన్నోడిడోళ్ళు కారే! సినిమా అన్నాక ఎన్నంగులుండాలా, ఎన్ని కతలుండాలా!' అని చౌదరి తేల్చి పారేసాడు.

'అమ్మమ్మ ఎంతమాట. ఆకథనిమ్మించిన కథలు ప్రపంచసాహిత్యంలోనే అరుదు. అయినా కథల్లో ఏముంది! చెప్పే విధానంలో వుందికాని' అన్నాడు ఆచారి.

'ఆమాటిందాకట్నుంచి యింటున్నా నయ్యా! ఏదీ నువ్వుసెప్పిన కత సిన్మాకి పన్కొచ్చేలా సెప్పు సూద్దాం!' అని చౌదరి సవాలేసాడు. ఆచారి వో నక్కచూపులాంటి చూపు పొగాక్కాడకేసి పారేసి నాలికతో పెదిమలు తడుపుకుని తడి పెదిమలు వేళ్లతో తుడుచుకుని కథ మొదలెట్టాడు.

"మొదటి దృశ్యంలో తెరంతా చీకటి పులుముకు నుంటుంది. రెండు నిముషాల పాటు ఆకలి ఆకలి అంటూ పాట వుంటుంది. ఆ పాటలో ధనికుల అజీర్తి పొట్టలు, బీదల మాడే డొక్కలు లాంటి మాటలన్నీ వస్తాయి. అల్లాంటి కమ్యూనిస్టు పదజాలంతో సినిమా తీస్తే గల్లా పెట్టె తప్పకుండా నిండుతుంది. మనుషులు మారాలి సినిమా చూసారా! అల్లా అన్నమాట. చీకట్లో రెండు కళ్ళు చూపిస్తాం. ఆ కళ్ల చూపుల్లో దైన్యం కన్పిస్తూ వుంటుంది. ఆ చూపులే నక్క చూపులు. భావం స్ఫురించటానికి తెర మీద కుడిచేతి పై మూల అంగట్లో మిటాయికేసి ఆశగా చూస్తున్న ముష్టి దాన్ని చూపించచ్చు. ఎల్లాగో ముష్టిదన్నాం. కనుక దానికి చాలీచాలని బట్టలు కడ్తాం అంటే సెక్సప్పీలు పెడ్తాం. అల్లాంటి సీన్సు కత్తిరేస్తే వాళ్లని దేశద్రోహులను కుంటారేమో నన్న భయం కొద్దీ సెన్సారువాళ్ళు ఆ సీనుల జోలికి పోరు. ఇంతకూ ఏం చెప్తున్నాను" అని ఆచారి ఆగాడు.

"సోది" అని బయటికే విసుక్కున్నాడు నిర్మాత హోదాలోవున్న చౌదరి. ఆ పైన "యిట్టాంటి యివరాలు తరువాత్తూసుకోవచ్చుగాని కత టూకీగా సెప్పు' అని గదమాయించాడు.

"నేను ప్రతి చిన్న వివరం విషయంలోను శ్రద్ధ తీసుకుంటానని మీరు గుర్తించారు. అదే టెన్ థవుజెండ్సు. మిగిలిన కథ టూకీగా చెప్పేస్తాను. మన కథలో హీరో నక్క. సహజంగా మంచిది. కాని సమాజం నక్కని చెడ గొట్టింది' నక్క చెడిపోయిందంటే కారణం ఎవరు? సమాజం. ఆ నక్కకి చాలా రోజులుగా తిండిలేదు. అందుకని దొంగతనానికి పూనుకుంది. సరిగ్గా దొంగతనం చెయ్యబోయే సరికి నక్కలో తెల్లనక్క బయటికి వచ్చి వారిస్తుంది. కాని ఇంతలో నల్లనక్క బయటికి వచ్చి అభినయంతో హోరాహోరి యుద్ధం చేస్తుంది. ఆకలిముందు తెల్లనక్క వోడిపోతుంది. నల్లనక్క విజయ గర్వంతో 'వూ' అని కుయ్యబోయి కూస్తే మనుషులు మేలుకుని న్యూసెన్సు కేసు పెడతారేమోనని మానేస్తుంది. అప్పుడు నక్క దొంగతనంగా వో పాక చుట్టూవున్న ఆవరణలో జొరబడి వో కోడిపెట్టను నోట కరుచు కుంటుంది. కోడిపెట్ట హృదయ విదారకమైన అరుపు అరవటంతో ఇంతసేపు హాల్లో వున్న నిశబ్దంపోయి గొడవ గొడవగా శబ్దాలు వినిపిస్తాయి. ఆ శబ్దానికి మేలుకున్న కుక్కలు తరుముకురాగా నక్క పరుగెత్తుతుంది. అల్లా పరిగెత్తడంలో నోట్లో కోడి పెట్ట జారిపోతుంది. ఒక్క క్షణం నక్క జారిపోయిన తిండికేసి జాలిగాచూసి తిరిగి పరుగు లంకించుకుంటుంది. అల్లా పరిగెత్తుతూ పోయిన నక్క వో గుట్ట మీదకు జేరుకుంటుంది. దానిమీదకున్న దారి చాలా కష్టమైంది. సరిగ్గా నక్క గుట్ట పైభాగానికి చేరేసరికి కుక్కలు దిగువభాగాన్ని చేరుకుంటాయి. ఇంత వరకు జరిగిన కథలో నక్క గుట్టమీద ఎందుకుంది అన్న పాయింటు ఎస్టాబ్లిష్ చేసాం. ఈ మాట గుర్తుంచుకోండి. ఎస్టాబ్లిష్ చెయ్యటం అంటే తెలివైన ప్రేక్షకులు "ఇల్లాగే ఎందుకు జరిగింది? ఇంకోలా ఎందుకు జరగలేదు?" అంటూ నిలదీయకుండా జాగ్రత్తపడ్డం అన్నమాట' ఆచారి వూపిరికోసం ఆగాడు.

"తరువ్వ కొచ్చిన కుక్క నయాలాలి మాటేటి?" అనడిగాడు చౌదరి.

"చెప్తాను. కొంచెం మీరు వోపిక పట్టాలి. అయితే మీరు వోపిక పట్టలేక వాటి మాటేటి అని అడిగారంటే కారణం కథలో వున్న సస్పెన్సు. సస్పెన్సు అంటే పట్టు అన్నమాట. అదల్లా నిలబెట్టటమే గొప్ప కథకుడి లక్షణం. అందుకని ఆ సీను అక్కడ కట్ చేస్తాం అంటే

కాస్సేపోవుతాం. ఆపి ఆ గుట్టకి దూరంగా వున్న ఆనకట్టని జూమ్‌లెన్సు పెట్టి దగ్గరకి లాక్కొస్తాం. అక్కడ ఆనకట్ట మీదున్న కాపలా మనిషి హడావిడి పడ్తుంటాడు. ఆనకట్ట ఎగువభాగంలో నీటి మట్టం పెరిగి పోతోంది. ప్రతి రెండేసి క్షణాలకి నీటి మట్టాన్ని దగ్గరగా చూపిస్తాం. ఆ పైన వాచ్‌మన్ తల తిరుగుతున్నట్లు చూపించటంకోసం కెమెరా గిర్రున తిరుగు తుంది. సూపర్‌వైజరు నైట్ క్లబ్బులో వున్నాడు. ఆయనొచ్చి గేట్లు తెరవకపోతే ఆనకట్ట విరిగిపోతుంది. వాచ్‌మన్ ఫోను చెయ్యబోతే ఫోను పని చెయ్యదు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్లు పని చెయ్యవు. ఆంబ్యులెన్సు టైర్లలో గాలుండదు. సున్నా సున్నా తిప్పితే పోలీసు స్టేషన్లో ఎవరూ ఫోనెత్తరు. ఎత్తినా ఫోనుమీద ఎవరూ కంప్లైంట్లు తీసుకోరు. మీకుతెల్సుకదా!''

''తెలవకపోటం యేటి! మా యింట్లో రాత్రి దీపాలుపోతే యియ్యాల పొద్దున్న ఎల్తురొచ్చాక కదా యెలక్టిసిటీ కోల్లొచ్చి బాగు సేసింది!'' అన్నాడు చౌదరి ఆచారిని బలపరుస్తూ.

''వాచ్‌మన్ కేం పాలుపోదు. అల్లాంటి పరిస్థితుల్లో అతనికి ఆ పక్కనే ఖాళీ జీపు కనిపిస్తుంది. అది పి. డబ్ల్యు. డి. వాళ్ల జీపు. అది వేసుకుని బయల్దేరాడు.''


''డ్రైవింగొచ్చినోడు డ్రైవరుగా వుండక కాపలావోడుగా ఎందుకున్నాడు?'' అని అడ్డుకొట్టాడు చౌదరి.

# సినిమాకి ఓ కథ

''అది చాలా మంచి ప్రశ్న. మామూలుగా అంతే కాని ఇతగాడికి డ్రైవింగొచ్చు. ఇతను పూర్వం జీపులు నడుపుతుండేవాడు. అయితే వో యాక్సిడెంటులో అతన్పెయ్యి పోయింది. అందుకని ప్రభుత్వం జాలితల్చి వాచ్‌మన్ వుద్యోగం ఇచ్చింది. ఆ ధైర్యంతో అతను జీపేసుకుని బయల్దేర్తాడు. ఆ జీపు సాయంత్రం సూపర్‌వైజర్ వేసుకొచ్చాడు. కాని ఆనకట్ట నుంచి సరాసరి నైటు క్లబ్బుకి కంట్రాక్టరు కారులో వెళ్లాడు. అసలు మొదట్లో సూపర్‌వైజర్‌కి కంట్రాక్టర్ల కార్లలో వెళ్లే అలవాటు లేదు. కాని అతనికి పెళ్లి కావాల్సిన చెల్లెలు, మంచానపడ్డ తల్లి, కనడానికి సిద్ధంగావున్న భార్య, కాలేజీ ఫీజు కట్టాల్సిన తమ్ముడు వుండటంతో పంట కాల్వలకి నీళ్లొదిలినప్పుడు మీలాంటి ధర్మదాత లిచ్చే డబ్బు పుచ్చుకోడం మొదలు పెట్టాడు. ఆ డబ్బులు మిగలటం మొదలయ్యాక తాగుడు, నైటు క్లబ్బులు మొదలయ్యాయి. ఈసారి పక్కవాడి పొలానికి నీళ్లొదలనందుకు డబ్బిచ్చాడో భూస్వామి. ఆ పైన నైటు క్లబ్బుకి స్వంత ఖర్చు మీద తీసుకెళ్లాడు. అక్కడ డాన్సు జోరుగా సాగుతూ వుంటుంది. ఇక్కడ జీపు వేగంగా నడుస్తూ వుంటుంది. వాచ్‌మన్ వంటిచేత్తో బ్రహ్మాండంగా జీపు నడుపుతూ వుంటాడు. ఇటువైపు నీటిమట్టం పెరుగుతూ వుంటుంది. ఆ డాన్సు సినిమాకి హైలైటు. అది వెంకట్లక్ష్మి చెయ్యొచ్చు. తనవంటి మెరుగు... అబ్బ!... నాకు తెల్సికాదు.... కేవలం వూహించి.... కోపం ఎందుకు... మనం మరో లక్ష్మిని బుక్ చేసుకుందాం. గిర్రున తిరుగుతున్న జీపు చక్రాలు, పెరుగుతున్న నీటిమట్టాలు, వేగం పుంజుకుంటున్న డాన్సు... ఆ సమయంలో కుక్కలు, నక్కను పట్టుకోడానికి గుట్టమీద కెక్కుతూ వుంటాయి. ఇంకో క్షణంలో నక్క దొరికిపోయే పరిస్థితి. దూరంగా దేవాలయంలోవున్న వెంకటేశ్వరస్వామిని నక్క ప్రార్థిస్తుంది. దేముడున్నాడన్న మాటకి నిదర్శనంగా ఆనకట్ట విరిగిపోతుంది. చెవులు బద్దలయ్యేలా నీటి హోరు... ఉరకలెత్తి వస్తున్న నీటినిచూసి బతికుంటే మరో నక్కని తరమొచ్చు అంటూ కుక్కలు తోక ముడిచి పారిపోతాయి. నక్క బతుకుజీవుడా అని గుట్ట సగం దిగేసరికి నీరు గుట్టను చుట్టుముట్టేస్తుంది. నక్క మళ్లీ పైకెక్కుతూ వుంటే నక్క వెంబడే నీటిమట్టం పైకి లేస్తూ వుంటుంది. నక్క కొట్టుకుపోతుందా లేదా అన్నది తెరమీద చూడాల్సినదే!''

''ఈరో మునిగిపోతే కతేమవుద్ది!'' అన్నాడు చౌదరి తెలివిగా.

''మాసారా! మీకు కూడా సినిమా కథల్సంగతి తెల్సిపోయింది. నక్క ఆ గుట్ట పైభాగం చేరుకునేసరికి నీటిమట్టం పెరగటం ఆగిపోతుంది. అయితే నక్క చుట్టూ నీళ్లు. ఆ నీళ్లు ఆకలిబాధితుల కన్నీరులా వుంటుంది. సుళ్లు తిరుగుతున్న





దీర్ఘ రోగులకు

'ఉత్తమ వైద్యము

కష్టంలేని కత్యము, ఉబ్బ సమ్మము, హస్త ప్రయోగము, అసంతృప్తి, ఉబ్బసము (దమ్ము), బోధకాళ్ళు, చెవుడు, కడుపునొప్పి, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా కూడా వైద్యము చేయబడును.

శ్రీబాలాజి వైద్యశాల, డా॥ పి. కుమారస్వామి
దేవర: ఓ. బి. రోడ్, తెనాలి. ఫోన్: 551.
బ్రాంచి 9—డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు—17

## మీరు-మీ మనసు

తలనొప్పిగావుంటే మీ చూపుడు వ్రేలు కనుబొమ్మలమధ్యవుంచి తలనొప్పి తగ్గిపోవాలి అనుకుని అలాగే 3 లేక 4 నిముషాలుంచండి. ఇతరులకు అలాగే చెయ్యండి. తలనొప్పి పోతుంది. మీకున్న మామూలు మనశ్శక్తితో ఒక్కో నొప్పి ఒక్కో రకంగా నిముషాల్లో తగ్గించొచ్చు. ఉబ్బసం, క్షయ, జ్వరాలు, మూర్ఛలు, తామర, నీరసం, దడ, ఆయాసం, బలహీనం మరి యే వ్యాధైనా ఆశ్చర్యంగా నివారించవచ్చు. మీరు వినోదంకోసం, విజ్ఞానం కోసం మీ కిప్పటికేవున్న మనశ్శక్తితో ఎన్నో చిత్ర విచిత్రాలు చేయవచ్చు. ప్రతి వారికి ఎంతో ఉపయోగకరమైన పుస్తకం. "అద్భుతాల పుస్తకం" వెల ఉగాదినుండి రు. 3/— పోస్టేజి రు. 1—50. తప్పక చదవండి.

**K. S. REDDY, M. A.**
**Wonderlands State Bank Road,**
**Tenali (A. P.)**

వాయిదాలపై ట్రాన్సిస్టర్



స్పాండర్స్ (జపాన్ మాడల్) 3 బ్యాండ్లు ఆల్ వరల్డు డబుల్‌స్పీకర్ ట్రాన్సిస్టర్ నైట్‌లాంపు అమర్చిబడి నది 10 రూ॥ల నెలసరి వాయిదాలపై ప్రతీగ్రామానికి, పట్నానికి పంపవచ్చు. ధర రు 240/-

**METRO SALES (80)** PB 2164, DELHI-7


# సినిమాకి ఓకథ

నీళ్ళు ఆకలి ఆకలి అని ఆక్రోశిస్తున్నట్టు అనిపిస్తుంది. నీళ్ళు ఆకలితో చుట్టుపట్ల పళ్ళెలు మాయంచేస్తాయి. నక్క కడుపులో ఆకలి అల్లాగే వుంటుంది. ఆ ఆకలితో నక్కకి నీరసం వస్తుంది. నీరసంలో మగతగా పడుకున్నంటే వో చిన్న కలొస్తుంది. అంటే మన సినిమాలో వో డ్రీమ్ సీక్వెన్స్ వుందన్నమాట. కాపో అంటే కలర్‌లో తీసిపారేయొచ్చు. ఆ కలలో నక్కల నాకలోకం అంటే స్వర్గం వుంటుంది. మన స్వర్గంలో రంభలు, సారాయి వుంటే నక్కల స్వర్గంలో గొర్రె పిల్లలుంటాయి. అవన్నీ చెంగు చెంగున ఎగురుతూ నక్క చుట్టు నాట్యం చేస్తూ వుంటాయి. ఇంతలో వో చిన్న నీటి 'కెరటం' నక్క కాళ్ళకి తగిలి నక్కకల చెదిరి పోతుంది. కనుచూపు మేరలో తిండి కన పడదు. అప్పుడు నక్క కారోజు ఏకాదశని గుర్తుకు వచ్చి ఆ రోజు వుపవాసంచేసి పుణ్యం సంపాదించు కుందాం అనుకుం టుంది." ఆచారి గుక్క తిప్పుకున్నాడు.

"ఏటి పంతులూ! నక్కల కేకాదశు లెట్టా తెలుత్తాయి" అని పప్పులో కాలే సావ్ చూసావా అన్నట్టు చూస్తూ చౌదరి నవ్వాడు.

"అదే ఎస్టాబ్లిష్ చెయ్యబోతున్నా నక్కకి వున్నట్టుండి కొండమీది దేవాల యం నుంచి పదకొండు గంటలు విని పిస్తాయి. ఆ దేవాలయంలో పూజారికి తిథుల ప్రకారం గంటలు కొట్టే అల వాటు. ఆ ఆనకట్ట కడుతున్న రోజుల్లో చాలామంది పనివాళ్ళు చచ్చిపోతుంటే కంట్రాక్టర్‌కి పాపభీతి పట్టుకుంది. అయితే చచ్చిపోయిన పనివాళ్ళ కుటుంబాలకి ధన సహాయం చెయ్యటం కంటే ఆ ఆన కట్ట పక్కనే వేంకటేశ్వరస్వామి ఆలయం కట్టించటం చవుకలో తేలేపని అని గుర్తించి వో గుడి కట్టించాడు. ఆ గుడిలో పూజారికి ఏరోజైనా తను దీపం పెట్టక పోతే దేవుడు మొత్తేస్తాడని భయం. వోసారి దీపం పెట్టని రోజు రాత్రి అతను పేకాటలో పది రూపాయలు పోగొట్టు కున్నాడు. అందుకని ఆ జలప్రళయంలో అతను ప్రాణాలకి తెగించి పడవలో గుడి చేరుకున్నాడు. అతను పడవలు నడప టంలో ప్రవీణుడన్న విషయాన్ని మనం ఏటా ఆ వూళ్ళో జరిగే పడవల పోటీలో అతనే గెలవటం ద్వారా ఎస్టాబ్లిష్ చెయ్యొచ్చు. అతను గుడిమెట్ల మీగాదు పైకెగబాకుతూ కిందికి జారిపోతూ వుం టాడు. అల్లా కష్టపడి పైకి చేరుకున్న పూజారి పదకొండు గంటలు కొట్టాడు. ఆ గంటలు విని నక్క ఆ రోజు ఏకాదశని పోల్చుకున్నది. పోల్చుకున్నాక ఉపవాసం చెయ్యటానికి నిశ్చయించుకుంది. అది దేవుడి పేరుమీద చేస్తే పుణ్యమన్నా వస్తుంది. లేకపోతే పుణ్యంరాదు. సరికదా మాడటం ఎల్లాగో తప్పదు! గాల్లో ఎగిరి పోవడానికి సిద్ధంగావున్న పేలపిండిని కృష్ణార్పణమస్తు అంటూ మనమే వదిలివేయటం లోనే మన తెలివితేటలు కన్పిస్తాయి. ఇంకంటాక్సు వాళ్ళు మన దగ్గరున్న డబ్బు ఎల్లాగో లాక్కుపోతారని తెలిసి నప్పుడు, దేవుడి హుండీలో వేసెయ్యటం ఉత్తమం. లేక డబ్బు ఎల్లాగో కొట్టుకెళ్ళి పోతోందని మనకి నిశ్చయంగా తెల్సి నప్పుడు మనం సినిమా తీసి కొల్లరమై పోడం తెలివైన పని. ఎల్లాగో సినిమా తీస్తున్నప్పుడు అది నీ కోసమేనని వెంక టేశ్వర్లుతో అంటే, ఆ ఆపదమొక్కులవాడు ఏను సంతోషించి మిమ్మల్ని సంతోష పెడు తుంది. డబ్బుపోయినా పుణ్యమన్నా దక్కు తుంది. అంటే నక్క వుపవాసం చెయ్య డానికి నిశ్చయించుకోడం వెనుక ఇంత ఆలోచన వుందన్నమాట."

"అట్టాగే! ఈ పిడకలేటెందుకు మధ్యలో" అన్నాడు చౌదరి ఇంకంటాక్సు వాళ్ళ మాట గుర్తొచ్చి ఇబ్బందిగా కదులుతూ.

"నిజమేనండి. ప్రేక్షకులమీద దెబ్బ కొడితే పాలుకేసి కూడా రారు. ఇంతకూ నక్క ఆ రోజంతా నిష్ఠగా ఉపవాసం చేస్తూవుంటే ఆ రోజు సాయంత్రం ఏళ్ళలో నక్కవైపు వో గొర్రెపిల్ల కొట్టు కొస్తూ నక్కకి కనిపిస్తుంది. నక్క నోరూరుతుంది. ఉపవాసం చేయటానికి మరో అవకాశమే రాకపోతుందా! ఏకా దశులు వచ్చినప్పుడల్లా పరిఘోట్టుకొస్తాయి. గొర్రెపిల్ల లాపు' ఈ మధ్య గొల్లల గోపి మరీ కట్టుదిట్టం పెంచేశాడు" అన త్తి-

ప్రశ్నకోసం ఆగాడు.

"మద్దెలో గోపీ యవరు? చౌదరి అడగనే అడిగాడు.

"అతను వాళ్లమ్మ కొకడే కొడుకు. అందుకని చిన్నప్పుడు గోపీకి గారాబం ఎక్కువై చదువు రాలేదు. గోపీ ఎనిమిదో ఏట వీధి బడిలో చేరాడు. ఏడాదికో అంకె చొప్పున పదిహేడేళ్లు నిండేసరికి తొమ్మిదంకెలు నేర్చుకున్నాడు. వాడు పద్దెనిమిదో యేడు నడుస్తుండగా ఒకటివేసి పక్కన సున్నాపెట్టటానికి ప్రయత్నిస్తున్నరోజుల్లో వాళ్ళ పక్కింటి పిల్ల సీత ఎనిమిదేళ్ల అమ్మాయి బడికొచ్చి "గోపీ మీ అమ్మ సచ్చిపోయింది" అని చెప్తుంది. ఈ వేషానికి మనం కావాలంటే వో బాల తారను పెట్టుకోవచ్చు. అప్పుడు గోపీ "అమ్మా!" అని హాలదిరి పోయేటట్టు కేకవేసి పలక సంతులు దగ్గరే వదిలేసి ఇంటికి పరిగెత్తుతాడు. వాళ్లమ్మ గోపీకి మిగిల్చి పోయిన ఆస్తి గొర్రెలు. అందుకని గోపీ వాటిని గాస్తూ రాత్రి ఒకటి... రెండు.. మూడు.. తొమ్మిది... బోల్డు అంటూ లెక్కబెట్టుకుని పడుక్కునేవాడు. గోపీకి లెక్కరాక పోడం వల్ల నక్క పని తేలికైపోయింది. రోజు కో గొర్రె చప్పున తినేయటం మొదలు పెట్టింది. ఇందులో మనం చదువు అవసరం గురించి దేశభక్తి జోడించి బోధిస్తాం!"

"సదవవుసరం మన్దేశంలో యాడుంది నా కుందా! మా బామ్మర్ది పెసిడెంటు కాలేదయ్యా కుందా?" చౌదరి ఆచారిని సరిదిద్దాడు.

"అదీ నిజమే లెండి. పోనీ ఆ పాట తీసేద్దాం. ఇంతకూ ఇలా వుండగా వో రోజు గోపీ గొర్రెలు తొమ్మిదేవున్నట్టు బోల్డు లేనట్టు గుర్తిస్తాడు. ఆ మర్నాడు ఎనిమిదే వున్నట్టు తొమ్మిది లేనట్టు పోల్చేసుకుని కట్టుదిట్టం పెంచేస్తాడు. దాంతో నక్క నాలిక తుప్పట్టి పోయింది. అందుకనే నీళ్లల్లో కొట్టుకొస్తున్న గొర్రె పిల్లను చూస్తుంటే నక్కకి కొంబులలు కూసినట్టు, పూలు విచ్చుకున్నట్టు, రకరకాలుగా ప్రపంచం కన్పించ సాగింది. అయితే గొర్రెపిల్ల దగ్గర కొచ్చినట్టే వచ్చి ప్రవాహంలో దూరంగా కొట్టుకుపోతుంది. నక్క వుపవాసనం భంగంకానందుకు సంతోషించింది. ఆ పైన మరో రెండ్రోజులకి నీరు తీయకపోటంవల్ల ఆ గుట్టమీద ఆకలితో చచ్చిపోయింది. దాని ప్రాణం తీసుకు వెళ్దామని వచ్చిన యమ దూతల్ని అడ్డుకొట్టి విష్ణుదూతలు దాన్ని వైకుంఠానికి తీసుకు పోతారు. సినిమా ఏకాదశీ వుపవాస మహత్యం గురించిన పాటతో ముగుస్తుంది." ఆచారి కథ పూర్తి చేసాడు.

"బావుంది" అన్నాడు చౌదరి. అది మాట వరుస కన్నట్టుగా.

"పెరట్లోకి పోయి తోటకూర కాడ పీక్కోనా" అని అడిగాడు ఆచారి.

"ఇయ్యాలేకాదశి కామోసు. వొద్దండవా?" అని నవ్వాడు చౌదరి. ఆచారి నిర్మొహమాటంగా నవ్వాడు. ●

మా ఆఫీసులందు సమ్మె అంతమైనదని తెలుపుటకు సంతసిస్తున్నాము.

# బుల్‌వర్కర్ పిల్లలకు శక్తివంతమైన పురుషాకృతి కలిగిస్తుంది.



19 సంవత్సరాల వయసులో, జేక్ సియలర్ ప్రతిదీ ప్రయత్నించాడు: ఎక్స్‌పాండర్లు బరువులూ, కాలిస్థెనిక్‌లు మరియు స్పోర్టులూ. కాని అతనెప్పుడూ అంటుకుపోయే పలుచని 'పిల్ల' శరీరంతో కన్పించేవాడు. అప్పుడు జేక్ బుల్‌వర్కర్‌తో శిక్షణ ప్రారంభించాడు. దేహానికి 15 కిలోల ఘన కండరాలు సమకూర్చుకోగలిగాడు, ఇప్పుడు ఛాంపియన్ ప్రమాణాలకు తయారవుతున్నాడు: ఛాతీ 116 సెం. మీ., చేతి కండరాలు 40 సెం.మీ. మోచేతులు 32 సెం.మీ. నడుము 78 సెం.మీ. తొడలు 62 సెం.మీ., పిక్కలు 37 సెం. మీ. జేక్ అంటాడు: "బుల్‌వర్కర్, పురుషుడు నిజంగా గర్వపడదగినట్టి పద్ధతిలో శరీరమును నిర్మిస్తుంది". జేక్ సియలర్ మరియు వేలాది ఇతరులకు చేసినట్టిది బుల్‌వర్కర్ మీకు కూడా చేయగలదు. ఫలితాలు గ్యారంటీ చేయబడ్డాయి లేకపోతే ఒక్క పైసా కూడా మీరు చెల్లించవక్కరలేదు.

**సులభమైన రోజుకు-5 నిముషాల బుల్‌వర్కర్ శిక్షణ మీరు అనుభవించి చూసి ప్రత్యక్షంగా కొలుచుకొనగల్గ ఫలితాలను రెండు వారాలలో ఇచ్చునని గ్యారంటీ చేయబడింది లేకపోతే మీరు డబ్బు ఏమీ చెల్లించ నక్కరలేదు.**

అది నిజమే. మీరు గడ్డం చేసుకొనేటంత కన్న తక్కువ సమయంలోనే, బుల్‌వర్కర్ మీకు మిగతా వారంతా అసూయపడే, ఆడపిల్లలు ఆరాధించే "పురుషత్వము" ఉట్టిపడేటటువంటి శరీరాన్ని నిర్మించగలదు. రోజుకు 5 నిముషాలపాటు చాలు. పుచ్చల్లాంటి చేతుల్ని ఉప్పొంగిపోయే ఉక్కులాంటి చేతి కండరాలుగా మార్చేందుకు, లోతైన పురుషత్వము ఉట్టిపడే ఛాతీ నిర్మించేందుకు, భుజాలను విశాలపరచేందుకు, ఉక్కులాగా గట్టి అయిన పొట్ట కండరాలను నిర్మించేందుకు, శక్తివంతమైన తొడలను మరియు పిక్కలను పెంపొందించేందుకు. ఫలితాలను మీరు ప్రత్యక్షంగా అద్దంలో చూడగలరు మరియు టేపుతో కొలిచి ఋజువుపరచుకొనగలరు రెండు వారాలలోనే దీనికి గ్యారంటీ ఉన్నది లేకపోతే మీరు డబ్బు ఏమీ చెల్లించనక్కరలేదు. పూర్తి వివరాల కోసం కూపను వెంటనే పోస్టులో వేయండి. ఎట్టి బాధ్యత లేదు.

© Mail Order Sales Pvt. Ltd.,
15 Mathew Road, Near Opera House, Bombay 4

60 TEL

శక్తివంతమైన పురుష కండరాలను పెంపొందించేందుకు గ్యారంటీ పొందిన బుల్‌వర్కర్ చారి పద్ధతిని గూర్చిన పూర్తి వివరాలను దయచేసి నాకు పంపండి.

SW11

పేరు ..............................

అడ్రసు ..............................

.............................. వయస్సు ......

**BULLWORKER SERVICE,**
**15 Mathew Road, Bombay 4**

దయయుంచి మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

ఇప్పుడు కంపెనీ రేట్ల ప్రకారం స్పెన్సర్ & కంపెనీ/లిమిటెడ్,
153, మౌంట్ రోడ్, మద్రాసు—2 నందు లభించును.